క్లుప్తంగా

కేసులు పెట్టడం సరికాదు..

దత్తిరాజేరు: సమాజంలో జరుగుతున్న సంఘటనలు తెలుసుకుని వాస్తవాలు రాయడమే పాత్రికేయుల విధి అని.. అటువంటి వారిపై కేసులు పెట్టి వేధించడం సరికాదని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పోలీసుల సహాయంతో సాక్షిపై వేధింపులకు పాల్పడడం సరికాదన్నారు. ప్రచురితమైన కథనాల్లో వాస్తవాలు గ్రహించి సరిదిద్దుకోవాలే తప్ప మీడియాపై ఎదురుదాడి దిగడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..



పాచిపెంట రాకేష్

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా సోషల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాచిపెంట రాకేష్ అన్నారు. మండలంలోని పెదమానాపురంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి కావాలన్నదే తన అభిమతం అన్నారు. తనను గుర్తించి ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించినందుకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, తదితరులు

వేపాడ: జిందాల్ కంపెనీకి భూములిచ్చిన ఎస్.కోట మండలం మూలబొడ్డవరకు చెందిన గిరిజనుల పట్ల నిర్లక్ష్యం తగదని ఏపీ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ బతుకులు బాగుపడతాయనే ఉద్దేశంతో రైతులు కంపెనీకి భూములిస్తే.. 18 సంవత్సరాలైనా కంపెనీ ఏర్పాటు చేయలేదన్నారు. పైగా ఆ భూముల్లో వెంచర్లు వేసి విక్రయించడానికి సిద్ధపడుతున్నారని ఆరోపించారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదన్నారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్రీడలతో మానసికోల్లాసం..



బ్యాడ్మింటన్ పోటీలకు హాజరైన క్రీడాకారులతో ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని పీఆర్ షటిల్ కోర్టులో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు విద్యకు అవరోధం కాదన్నారు. పోటీల నిర్వహణకు సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలకు నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీరాములు ధన్యవాదాలు తెలిపారు.

భోగాపురానికి మంత్రి కందుల దుర్గేష్

భోగాపురం: రాజాం పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం భోగాపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి దుశ్శాలువాతో సత్కరించి, సాదరస్వాగతం పలికారు.

అన్నసమారాధన

విజయనగరం టౌన్: మాస శివరాత్రి పురస్కరించుకుని, స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్ద ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో అన్నసమారాధన ఆదివారం నిర్వహించారు. ప్రతి నెలా వచ్చే మాస శివరాత్రికి భక్తులకు స్వామి వారి అన్నప్రసాదం అందించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి తెలిపారు. 2 వేల మందికి పైగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

చీరల పంపిణీ

విజయనగరం టౌన్: మండలంలోని హుకుంపేట రామమందిరం వద్ద శ్రీపైడిమాంబ స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరలు ఆదివారం పంపిణీ చేశారు. అమ్మవారికి మొక్కుగా భక్తులు చెల్లించిన చీరలను ఇలా పేదలకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పరశురాం, అప్పారావు, పతివాడ వెంకటరావు, పిల్లా రామకృష్ణ, మజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

57వ సారి రక్తదానం

విజయనగరంఫోర్ట్: నగరానికి చెందిన భవిరెడ్డి సుభాష్..57వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయన్న విషయం తెలుసుకున్న ఆయన ఓ యూనిట్ రక్తం దానం చేసి సాయం చేశారు. ప్రాణాపాయ స్థితిలో రక్తం అవసరమైన వారికి మనమి చ్చే రక్తం అందితే వారి ప్రాణాలు నిలబడతాయని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకురావాలని ఆయన కోరారు.

క్రీడలకు దూరం..



మైదానం అందుబాటులో లేని బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- అందుబాటులో లేని మైదానాలు
- రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ప్రతిభ చాటుతున్న విద్యార్థులు
- మైదానాలు ఏర్పాటు చేస్తే మరింత రాణిస్తామంటున్న క్రీడాకారులు

మెరకముడిదాం:

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి..క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది.. క్రీడల్లో బాగా రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఊదరగొడుతూ ఉంటారు. మాటల వరకు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అసలు చాలా పాఠశాలల్లో మైదానాలు లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో పలు పాఠశాలల్లో క్రీడా మైదానాలు కరువయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లోనూ క్రీడా మైదానాలు లేకపోవడంతో ప్రాథమిక దశలోనే విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. పెద్ద పెద్ద బ్యాగుల్లో మోయలేనన్ని పుస్తకాలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కుస్తీ పడుతున్నారు. విద్యార్థులకు కనీసం మానసిక ప్రశాంతత లేని దుస్థితి నెలకొంది. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మొత్తం 16 జెడ్పీ పాఠశాలలకు మైదానాలు లేవు.

మైదానాలు లేని పాఠశాలలు..

మెరకముడిదాం మండలంలోని బైరీపురం, బిళ్లలవలస, గరుగుబిల్లి, సాతాంవలస, కేజీబీవీ.. చీపురుపల్లి మండలంలో పేరపి, పి.కె.పాలవలస, చీపురుపల్లి బాలికోన్నత పాఠశాల.. గరివిడి మండలంలో కొండపాలెం, తాటిగూడ, శివరాం, దేవాడ, అర్తమూరు.. గుర్ల మండలంలోని గరికివలస, గుర్ల, కొండగంగ్రేడు పాఠశాలలకు మైదానాలు లేవు.

క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు..

మెరకముడిదాం మండలంలోని బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అప్పట్లో రెండు ఎకరాల క్రీడా మైదానాన్ని కేటాయించారు. అయితే ఈ క్రీడామైదానం పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరంలో పోరలి వెళ్లే ప్రధాన రహదారిలో ఉంది. అయితే మైదానం దూరంగా ఉండడంతో విద్యార్థులు వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. అలాగే బిళ్లలవలస, సాతాంవలస, గరుగుబిల్లి, బుధరాయవలస, మెరకముడిదాం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలకు కూడా మైదానాలు లేవు. ఆయా పాఠశాలల విద్యార్థులకు క్రీడలపై మక్కువ ఉన్నప్పటికీ మైదానాలు లేకపోవడంతో క్రీడలకు దూరమవుతున్నారు. మైదానాలు లేకపోయినా పాఠశాల ఆవరణల్లో ఉన్న చిన్నపాటి స్థలాల్లోనే పీడీలు, పీఈటీలు విద్యార్థులతో ఆటలాడిస్తున్నారు. ఇప్పటికే స్కూల్‌గేమ్స్ పోటీల్లో విద్యార్థులు బాగా రాణిస్తున్నారు. మైదానాలుండి ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తామని విద్యార్థులు చెబుతున్నారు.

మరింతగా రాణిస్తాం..

జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యాను. అయితే మా పాఠశాలలో మైదానం లేకపోవడంతో సరైన శిక్షణ పొందలేకపోతున్నాను. అదే మైదానం ఉంటే శిక్షణ పొంది జాతీయ స్థాయిలో కూడా రాణిస్తా.

-రెడ్డి జాహ్నవి, బైరిపురం, మెరకముడిదాం మండలం

ఇబ్బందిగా ఉంది..

మా పాఠశాలలో మైదానం లేకపోవడంతో రహదారిపైనే ప్రాక్టీస్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాను. ఇటీవల జరిగిన మండల స్థాయి పోటీల్లో రాణించి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అధికారులు స్పందించి మైదానం ఏర్పాటు చేయాలి.

- రెడ్డి లావణ్య, పిల్లలవలస, మెరకముడిదాం మండలం

విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా..

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా గౌరవించడంతో పాటు ఉద్యోగాలు కల్పిస్తుంది. అయితే క్రీడా మైదానాలు లేకపోవడం, సరైన ప్రోత్సాహం అందకపోవడంతో రాణించలేకపోతున్నామని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సత్తా చాటిన మోడల్ పాఠశాల విద్యార్థులు



క్రీడల్లో రాణించిన విద్యార్థులతో ప్రిన్స్‌పాల్ ఈశ్వరరావు, తదితరులు

దత్తిరాజేరు: కొద్ది రోజుల కిందట విజయనగరం విజ్జీ స్టేడియంలో జరిగిన అండర్–19 అథ్లెటిక్స్‌లో షికారుగంజి మోడల్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్స్‌పాల్ ఈశ్వరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన ఎ.ఆదిత్య, జాహ్నవి, ఎం. మేఘన, పి. లావణ్య, రోహన్, ఎల్. అలేఖ్య, సాహిత, అనుషా, గిరి వివిధ విభాగాల్లో రాణించారన్నారు. వీరందరూ ఈ నెల 22, 23 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అభినందన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక



వేపాడ: జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం బీపీఏ రాజు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ 14 విభాగం కబడ్డీలో వి.సుధీర్, రోహిత్.. ఖోఖోలో హెచ్.దిలీప్, వై.రోహిత్.. యోగాలో వివేక్.. రన్నింగ్‌లో సీహెచ్ చక్రి.. హైజంప్‌లో డి. చైతన్య.. అండర్ 17 విభాగం జావెలెన్ త్రోలో ఎస్.అజయ్.. హైజంప్‌లో బి.ఎర్నాయుడు.. లాంగ్‌జంప్‌లో ఆర్.ఎర్నాయుడు.. రన్నింగ్‌లో కె.నవీన్.. బాలికల యోగాలో గీతిక, హర్షిత.. ఖోఖోలో వర్షిణి రాణించారన్నారు. జోనల్‌స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో వైద్యం దూరం



కూరాకులవీధిలో పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేదలకు మెరుగైన వైద్యం దూరమవుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని పాతకూరాకుల వీధి, చిలుకూరివీధిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందనివ్వకుండా కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రారంభించిన పోరాటానికి ప్రతిఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

ఆర్థిక సాయం..



రోగి బంధువులకు సాయం అందజేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, వాకాడ, తదితరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు తన గౌరవ వేతనాన్ని క్యాన్సర్ పేషెంట్‌కు సాయంగా అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడిగా ఆయనకు వచ్చిన గౌరవ వేతనం 40,000 రూపాయలకు మరో పది వేలు కలిపి మొత్తం 50 వేల రూపాయలను ఓ క్యాన్సర్ రోగికి ఆదివారం అందజేశారు. జామి స్పందన ప్రస్తుతం బసవతారకం క్యాన్సర్ హాస్పటల్‌లో (హైదరాబాద్) చికిత్స పొందుతోంది. గరివిడిలో గల ఆమె బంధువులు కోరిన మీదట సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాకాడ శ్రీను ఆర్థిక సాయాన్ని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి, కుమార్తె సత్యశ్రీ అనూష చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, బమ్మిడి అప్పలస్వామి, బమ్మిడి కార్తీక్, ముల్లు రాంబాబు, కొణిశ కృష్ణంనాయుడు, పొన్నాడ కుమార్, నీలాద్రి, కుదుర్ల సురేష్, దుబాయ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి



రిలే నిరాహార దీక్షలో ఉన్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: కంపెనీ కట్టేస్తాం..ఉద్యోగాలు ఇచ్చేస్తాం అంటూ భూములు తీసుకుని మోసం చేసిన జిందాల్ కంపెనీపై చర్యలు తీసుకోవడంతో పాటు భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేసి రైతులకు తిరిగి అప్పగించాలని బాధితులు కోరారు. బొడ్డవరలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరంలో పలువురు నిర్వాసితులు ఆదివారం మాట్లాడుతూ.. నాడు భూములిచ్చిన సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. నాలుగు నెలలుగా నిరసన చేపడుతున్నా అధికారుల్లో చలనం లేదన్నారు.

యోగాలో రాణించిన రామకృష్ణ



యోగా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రామకృష్ణ

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల శ్రీరామకృష్ణ మఠం వివేకానంద విద్యావికాస్ కేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో మాస్టర్స్ మెన్ గ్రూప్ (సి)లో ఎస్.కోట పట్టణానికి చెందిన బొబ్బిలి రామకృష్ణ ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో ఈయన ఈ నెల 25,26 తేదీల్లో విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. అలాగే సర్వేపల్లి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.హృషీకేశ్, బి.లాస్యశ్రీ సబ్‌జూనియర్ విభాగంలో చక్కని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా యోగా శిక్షకులు సభినేటి రవి, నడుపూరి పైడిరాజు, బమ్మిడి సన్యాసిరావు వ్యవహరించారు. రామకృష్ణ, తదితరులను ఏపీ యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బూర్లె శ్రీధర్, కర్రి కృష్ణ, తదితరులు అభినందించారు.

గౌరవ వేతనం అందేదెప్పుడో..?

- అమలు కాని ఎన్నికల హామీ
- 14 నెలలుగా అందని వేతనం
- ఎదురుచూస్తున్న ఎంపీటీసీ సభ్యులు



దత్తిరాజేరు మండల పరిషత్ కార్యాలయం

దత్తిరాజేరు:

ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం పెంచుతామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టి 16 నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో ఎంపీటీసీ సభ్యులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. ప్రజలచే నేరుగా ఎన్నుకోబడిన ఎంపీటీసీ సభ్యుల్లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వారే. వీరందరూ సామాన్య కుటుంబాలకు చెందిన వారే. నెలల తరబడి గౌరవ వేతనం మంజూరు చేయకపోతే సమావేశాలు, సభలకు ఎలా హాజరుకాగలమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నియోజకవర్గంలో ఎంపీటీసీల సంఖ్య	
మండలం	ఎంపీటీసీ సభ్యులు
దత్తిరాజేరు	16
గజపతినగరం	16
బొండపల్లి	15
గంట్యాడ	19
మొత్తం	66

పట్టించుకోకుండా..

ఎంపీటీసీ సభ్యులకు ప్రతి నెలా గౌరవ వేతనం కింద 3 వేల రూపాయలు ప్రభుత్వం ఇస్తుంది. ఎన్నికల సమయంలో ఆ మొత్తాన్ని పది వేల రూపాయలకు పెంచుతామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంన్నర దాటిపోతున్నా ఆ హామీ గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. కనీసం గతంలో ఇచ్చే మూడు వేల రూపాయలు ఇచ్చినా బాగుంటుందని ఎంపీటీసీ సభ్యులు అభిప్రాయపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కనీసం రెండు, మూడు నెలలకోసారైనా వేతనాలు అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంతవరకు ఒక్క రూపాయి కూడా అందలేదని సభ్యులు వాపోతున్నారు.

సముచిత స్థానం కల్పించాలి..

ప్రజలు తమకు కూడా ఎన్నికలలో ఓటు వేసి గెలిపించినా కొన్ని పనులకే పరిమితం చేస్తున్నారు. రెండు నుంచి మూడు వేల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న మాకు కొన్ని కార్యక్రమాలకు పిలవడం లేదు. కూటమి నాయకులకు పదవులు లేకపోయినా వారికి గౌరవం ఇస్తున్నారు. మాకు గౌరవం లేదు..గౌరవ వేతనం లేదు.

– గొటివాడ కన్నయ్య, ఎంపీటీసీ సభ్యుడు, పెదమానాపురం

హామీలు నెరవేర్చాలి..

ఎంపీటీసీ సభ్యులు గౌరవేతనాన్ని పెంచుతామని ఎన్నికల ప్రచార సమయంలో చంద్రబాబు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా హామీ అమలుకు నోచుకోక పోవడం బాధాకరం. ప్రజలు తమను నేరుగా ఎన్నుకున్నా ప్రభుత్వం వచ్చిన తారువాత మాపట్ల చులకన భావం ఏర్పడింది.

– పొడుపురెడ్డి భవానీ, ఎంపీటీసీ సభ్యురాలు, పెదవేమలి, గంట్యాడ మండలం

ఆదేశాలు రాలేదు..

ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాల పెంపునకు సంబంధించి ఆదేశాలు రాలేదు. మూడు వేల రూపాయల వంతున గంట్యాడ మండలంలో 14 నెలలకు గౌరవ వేతనాలు అందించాల్సి ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం. దత్తిరాజేరు, బొండపల్లి, గజపతినగరం మండలాలలో మూడు, నాలుగు నెలలకు బడ్జెట్ రాగానే వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరుగుతుంది.

– రాములమ్మ, ఎంపీడీఓ, గంట్యాడ

– రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ, దత్తిరాజేరు

చెరువును తలపిస్తున్న రహదారి



ప్రమాదకరంగా మారిన రహదారి

జామి: మండలంలోని భీమసింగి నుంచి వీఆర్ పాలెం వెళ్లే ప్రధాన రహదారిలో తెలగాపాలెం వద్ద పెద్ద పెద్ద గోతులేర్పడడంతో వర్షపు నీరు నిలిచిపోతోంది.దీంతో ఈ రోడ్డు చెరువును తలపిస్తోంది. గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంటోందని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- అగ్నిమాపక శాఖాధికారి ఎంఎస్‌వీ ప్రసాద్



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి రవిప్రసాద్

గజపతినగరం: దీపావళి సందర్భంగా మందుగుండు సామగ్రి కాల్చేటప్పుడు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక శాఖాధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్ అన్నారు. మండలంలోని గుడివాడ జాతీయ రహదారి సమీపంలో ఉన్న క్రాకర్స్ షాపు వద్ద ఆయన ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యంగా చిన్నారులు మందుగుండు కాల్చేటప్పుడు వారిని ఓ కంట కనిపెట్టాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదం తప్పదన్నారు. ఎదుటవారితో పోటీపడి మందుగుండు కాల్చకూడదని సూచించారు.

భగవద్గీత ప్రతుల పంపిణీ..

ఎస్.కోట పట్టణంలోని మోక్షవిద్య యోగామందిర్ నిర్వాహకులు, సభ్యులు ఆదివారం సాయంత్రం పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి భగవద్గీత ప్రతులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదివి జీవిత సత్యం తెలుసుకోవాలని సూచించారు. – శృంగవరపుకోట

